సాక్షి
జగిత్యాల
సోమవారం । 28 । ఆగస్టు । 2023



నృసింహుని సేవలో స్వప్నిక

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం అంతర్జాతీయ క్రీడాకారిణి స్వప్నిక దర్శించుకున్నారు. అలాగే ఆమెను డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ సన్మానించారు.



కోతులు.. అడవి పందులు

ఇటీవల కాలంలో అడవిపందులు, కోతుల బెడద ఎక్కువకావడంతో రైతులు మిశ్రమ పంటలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ఆదాయం కోల్పోతున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

పెగడపల్లి(ధర్మపురి): అర్హులైన ప్రతి ఒకరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ దివాకర పేర్కొన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పెగడపల్లి మండలం ఏడుమోటలపల్లిలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం సందర్శించి ప్రత్యేక ఓటరు నమోదు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. బీఎల్‌వోలు ఇంటింటా సర్వే చేసి 18 ఏళ్లు నిండినవారిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లను గుర్తించి వారిని సైతం ఓటరు జాబితాలో చేర్చాలని, అంగవైకల్యం ఉన్న ఓటర్లను గుర్తించి సదరం డేటా ద్వారా వారిని ఓటర్ జాబితాలో నమోదు చేయాలన్నారు. అలాగే ఇంతకు ముందుగా జాబితాలో ఉన్న వారిని కొత్తగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. సర్పంచ్ రవినాయక్, ధర్మపురి, పెగడపల్లి తహసీల్దార్లు కృష్ణచైతన్య, ఎంపీఓ ఫరూక్, ఆర్‌ఐ శ్రీనివాస్, బీఎల్‌వో మంగ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యకర సమాజం



కొత్తదాంరాజుపల్లిలో కిషన్ తదితరులు

మల్లాపూర్(కోరుట్ల): రోజూ సైక్లింగ్ చేయడంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వాల్గొట్ కిషన్ అన్నారు. ఆదివారం సైక్లింగ్‌తో నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి మల్లాపూర్ మండలం కొత్తదాంరాజుపల్లికి చేరుకుని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైక్లింగ్‌తో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని, షుగర్, రక్తపోటు, ఉబకాయాన్ని నివారించవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు తరిగిపోతున్న పెట్రోల్ నిల్వలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలందరూ నిత్యం సైక్లింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, సైక్లింగ్ క్లబ్ కన్వీనర్ శ్రీరాముల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై హర్షం



కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీగా తరలివెళ్లి అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే చిత్రపటానికి సైతం క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూత లభిస్తుందన్నారు. దళితులు, అట్టడుగు వర్గాలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, తాటిపర్తి రాంచంద్రారెడ్డి, నక్క జీవన్, ధర రమేశ్, మన్సూర్, నేహాల్, గుండ మధు, బొల్లి శేఖర్, బీరం రాజేష్ ఉన్నారు.

జాబితాపూర్ వాసికి డాక్టరేట్



గంగారెడ్డి

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన కొక్కు గంగారెడ్డికి ఉస్మానియా యూనివర్శిటీ భౌతికశాస్త్రంలో డాక్టరేట్ ప్రకటించింది. గంగారెడ్డి 2016లో జాతీయ స్థాయి ప్రవేశపరీక్షలో 45వ ర్యాంకు సాధించి జేఆర్‌ఎఫ్ ఫెలోషిప్ పొందాడు. 2017లో ఉస్మానియా యూనివర్శిటీలోని భౌతికశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశం పొంది, ప్రొఫెసర్ ఎంవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో పరిశోధనలు చేశారు. 'ప్రిపరేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ బీమ్ ఎవాపరేటెడ్ ప్యూర్ అండ్ జింక్ డోప్డ్ నికెల్ ఆక్సైడ్ థిన్ ఫిల్మ్స్ ఫర్ గ్యాస్ సెన్సింగ్ అప్లికేషన్స్' అంశంపై పరిశోధన చేశాడు. అతడు రాసిన పలు పరిశోధన అంశాలు వివిధ అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈసందర్భంగా గంగారెడ్డిని ప్రొఫెసర్లు, తోటి విద్యార్థులు అభినందించారు.

సతీశ్ మర్డర్‌కు పక్కా ప్లాన్

- బార్ వద్ద గంటపాటు గడిపిన నిందితులు
- అనుమానం రాకుండా సతీశ్‌తో మాటామంతీ
- ఇంటికి వెళ్లే సమయంలో వెంట తీసుకెళ్లి హత్య
- సీసీ కెమెరాల్లో రికార్డయిన కదలికలు



హత్యకు ముందు బార్ ఎదుట కూర్చున్న సతీశ్, రాజేశ్ తదితరులు (సీసీ ఫుటేజీ)



సతీశ్‌ను తీసుకెళ్తున్న రాజేశ్(సీసీ ఫుటేజీ)

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో సంచలనం సృష్టించిన కన్నం సతీశ్ హత్య పక్కా ప్లాన్ ప్రకారమే జరిగినట్లు తెలుస్తోంది. మద్యం కోసం బార్ వద్దకు సతీశ్ రాగా, అప్పటికే అక్కడ మాటు వేసిన జక్కం రాజేశ్.. మరికొందరితో కలిసి అతడిని మట్టుబెట్టా డని పోలీసులు భావిస్తున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని సీసీ ఫుటేజీలు ప్రస్తుతం బయటకు వచ్చాయి. అందులో రాజేశ్.. సతీశ్ కలిసి బార్ ఆవరణలో ఒకేచోట కూర్చొని మాట్లాడుకుంటూ మద్యం తాగినట్లు దృశ్యాలు రికార్డు అయ్యాయి. చివరివరకూ అనుమానం రాకుండా వ్యవహరించిన రాజేశ్.. ఆ తర్వాత అందరూ ఇంటికి వెళ్లే సమయంలో సతీశ్‌ను బార్ వెనుక వైపు తీసుకెళ్లి దాడి చేసి హతమార్చాడని పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. ఈ దారుణానికి మరికొందరు సహకరించినట్లు సీసీ ఫుటేజీలో స్పష్టమవుతోంది. దీనిని ఇప్పటికే పోలీస్ అధికారులు ధ్రువీకరించారు.

ఇలా జరిగింది...

- గత ఆదివారం రాత్రి 10.58 గంటలకు సతీశ్, తన స్నేహితుడు నిఖిల్‌తో కలిసి పట్టణంలోని ఓ బార్ వద్దకు వచ్చాడు.
- అప్పటికే జక్కం రాజేశ్ బార్ ఎదుట మద్యం తాగుతూ ఉన్నాడు.
- సతీశ్, నిఖిల్ మద్యం కొనుగోలు చేసిన తర్వాత మొదట తమ ద్విచక్ర వాహనాల వద్దకు వెళ్లి తాగారు. కాసేపటికి అక్కడే మరోఇద్దరితో కలిసి మద్యం తాగుతున్న రాజేశ్ వద్దకు వెళ్లారు.
- దాదాపుగా రాత్రి 11.48గంటల వరకు ఐదుగురు అక్కడే కూర్చొని మాట్లాడుకుంటూ మద్యం తాగారు.
- ఆ తర్వాత సతీశ్, రాజేశ్ బార్ పక్కన సందిలోకి నడుచుకుంటూ వెళ్లారు. ఆ సమయంలో రాజేశ్ చేతిలో బీరు సీసా ఉంది.
- నిఖిల్ అక్కడే కూర్చొని ఉండగా.. మిగతా ఇద్దరు వారి వెనుక వెళ్లారు.
- అనంతరం సతీశ్‌ను తీవ్రంగా కొట్టి హతమార్చా రు. అయితే ఈ ముగ్గురే కాకుండా హత్య సమయంలో బార్ వెనుక మరికొందరు కూడా ఉండి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

నిందితుల కోసం వేట ముమ్మరం..

సతీశ్‌ను హత్య చేసిన రాజేశ్‌తోపాటు మరోఇద్దరు అప్పటినుంచి పరారీలో ఉన్నారు. వారిని పట్టుకోవడానికి పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే హత్యకు ముందు బార్ వద్ద రాజేశ్, సతీశ్‌తో కలిసి కొందరు యువకులు ఉన్నారు. వీరు హత్యకు అర్ధగంట ముందు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారికి హత్యలో ప్రమేయం ఉందనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఏదీఏమైనా ప్రధాన నిందితుడిగా భావిస్తున్న రాజేశ్ పట్టుబడితేనే ఈ హత్య మిస్టరీ వీడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అన్ని కోణాల్లో దర్యాప్తు

సతీశ్ హత్య విషయంలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. బార్‌తోపాటు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. తొందరలోనే కేసును ఛేదిస్తాం.
– లక్ష్మీనారాయణ, సీఐ

ఇదీ నేపథ్యం..

పట్టణానికి చెందిన సతీశ్, రాజేశ్ మధ్య గతంలో స్థానిక మినీ స్టేడియంలో ఓ గొడవ జరిగింది. ఆ గొడవలో రాజేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. అప్పట్నుంచి సతీశ్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈక్రమంలోనే గత ఆదివారం సతీశ్ హత్య జరిగిన విషయం విదితమే.

సోమేశ్వర కొండకు మహర్దశ



కొండపై కనకసోమేశ్వరస్వామి ఆలయం(ఫైల్)

- ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.25కోట్లతో ప్రతిపాదనలు
- మొదటి దశలో రూ.10కోట్లు మంజూరు
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మించాలన్న కల నెరవేరబోతోంది. ఎన్నో ఏళ్లుగా మల్లాపూర్‌తో పాటు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు ఉమ్మడి రాష్ట్రంలోని గత ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోలేదు. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్, ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వడంతో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఘాట్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజురు చేయిస్తానని హామీ ఇచ్చారు. మొదట రూ.10 లక్షలు మంజూరు చేయించి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి కొండపై సర్వే చేయించారు. అనంతరం రూ.25కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, మొదటిదశలో కొండపైకి మట్టిరోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నిధులు రూ.10కోట్లు మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో సోమవారం సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఘాట్‌రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెండో విడతలో రూ.15కోట్లు మంజూరు చేయించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఘాట్‌రోడ్డు పూర్తయితే కనకసోమేశ్వర స్వామి ఆలయం పుణ్యక్షేత్రంగా బాసిల్లనుందని మండలవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ చరిత్ర

1,200 ఏళ్ల క్రితం కాకతీయుల పాలనలో కొండపై కనకసోమేశ్వరుని ఆలయం నిర్మితమైందని చారిత్రక ఆధారాలున్నాయి. కొండపైకి మెట్ల మార్గంలో సుమారు గంటకుపైగా నడిచి స్వామివారిని దర్శించుకోవాలి. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు కొండపైకి వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. భక్తుల కోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే ఘాట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో దశాబ్దాల కల నెరవేరనుంది.

భక్తుల కల నెరవేరబోతోంది



కనకసోమేశ్వరస్వామి కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండల ప్రజ లు, భక్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. వారికి ఇచ్చి న హామీని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వానికి రూ.25కోట్లతో ప్రతిపాదనలు పంపాను. మొదటి విడతలో మట్టిరోడ్డుకు రూ.10కోట్లు మంజురయ్యాయి. ఈ మండలవాసిగా ప్రజల కలను నెరవేరుస్తున్నందుకు ఆనందంగా ఉంది. – కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే, కోరుట్ల

వలస వెళ్లిన, మృతిచెందిన వారి పేర్లు తొలగించండి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: వలస వెళ్లిన, మరణించిన వారి పేర్లను తక్షణమే ఓటరు జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా సూచించారు. ఆదివారం జగిత్యాల అర్బన్ విద్యానగర్ జూనియర్ కళాశాల, పురానిపేట ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటా సర్వేతోపాటు మృతిచెందిన, వలస వెళ్లిన వారి పేర్లను తొలగించాలని పేర్కొన్నారు. అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. డబుల్ ఓటర్లు, చనిపోయినవారి పేర్ల తొలగింపునకు ఫారం 6 ద్వారా చేపట్టే కార్యాచరణ వివరించారు. సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ అనిల్, అర్బన్ తహసీల్దార్ కె.వరందన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ వస్తే దళిత, గిరిజనులకు మంచి రోజులు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళిత, గిరిజనులకు అన్నీ మంచిరోజులేనని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నాడు. ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి రాజయ్యకు, ఖానాపూర్ నుంచి రేఖానాయక్‌కు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వకుండా దళిత, గిరిజనులను మోసం చేశారని దుయ్యబట్టారు. ధర్మపురి నియోజకవర్గంలోని దళిత నిరుపేదలకు మిగులు భూములు ఇవ్వకుండా తాత్సారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పదో తరగతి పాసైతే రూ.10 వేలు, ఇంటర్ ఉత్తీర్ణత సాధిస్తే రూ.15 వేలు, డిగ్రీ రూ.25 వేలు, పీజీ పాసైతే రూ.లక్ష సాయం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందిస్తుందని దళిత డిక్లరేషన్ ద్వారా తెలుపడం జరిగిందన్నారు. అలాగే అంబేద్కర్ అభయహస్తం కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.12 లక్షల ఆర్థికసాయం, ఇల్లు నిర్మించుకునే వారికి రూ.6 లక్షలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న పాత్రికేయులకు కనీస నీడను కల్పించకపోవడం బాధాకరమని, ఇళ్ల స్థలాల విషయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేశారు. లేదంటే కాంగ్రెస్ గద్దెనెక్కిన 60 రోజుల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.దినేశ్, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, రఫియొద్దీన్, అశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో కోరుట్ల భజన మండలి సంకీర్తన



భజన చేస్తున్న కోరుట్ల శిరిడీ సాయి భజన మండలి

కోరుట్ల: తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రిలో నెల రోజుల అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని భక్తి భజన సంగీత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి షిరిడీ సాయి భజన మండలి కోరుట్ల వారిని ఆహ్వానించగా సభ్యులు ఆదివారం సంకీర్తనలు ఆలపించారు. నీలకంఠ శ్రీనివాస్, ఎస్. ప్రకాష్, ఎ.ఆనంద్, కె.నాగభూషణం, వేముల రవి, అల్లె నారా యణ, పవన్ కుమార్, బోగ అజయ్, సత్యం, పా ల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ హామీ ఏమైంది?



మాట్లాడుతున్న సత్యంరెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ హామీ ఏమైందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని ముత్యంపేటలో మాట్లాడారు. ప్రజలు అధికారమిస్తే 100 రోజుల్లో షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేసి పునరుద్ధరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి రైతుల గోడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం నియోజకవర్గ పర్యటనకు రానున్న మంత్రి షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. నియోజకవర్గ పర్యటన ముగిసేలోగా మంత్రి షుగర్ ఫ్యాక్టరీ, రాళ్లవాగు మరమ్మతు, పంట నష్ట పరిహారంపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



శ్రీరాములపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

గొల్లపల్లి(ధర్మపురి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని శ్రీరాముపల్లి గ్రామంలో రూ.2.30 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతాంగానికి 24 గంటల కరెంట్ అవసరం లేదన్నారని, మూడు గంటలు సరిపోతుందని అనడం రైతులను అగాధంలో నెట్టివేసినట్టేనన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి కోత విధించడంలేదని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొల్లం రమేష్, ఎంపీపీ నక్క శంకర్, జెడ్పీటీసీ జలేందర్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు నేరెల్ల గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మాధవరావు, బోయపోతు గంగాధర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.12.42 కోట్లు..

గొల్లపల్లి/ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో చేపట్టే వివిధ రకాల 278 అభివృద్ధి పనులకు రూ.12.48 కోట్లు మంజూరైనట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రకటనలో తెలిపారు. ధర్మపురి మండలంలో 71 పనులకు రూ.2.73 కోట్లు, బుగ్గారం పరిధిలో 23 పనులకు రూ.1.39 కోట్లు, గొల్లపల్లి మండలంలో 65 పనులకు రూ.3.04 కోట్లు, పెగడపెల్లి పరిధిలో 53 పనులకు రూ.2.24 కోట్లు, వెల్గటూర్ మండలంలో 66 పనులకు రూ.3 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.



భక్తుల పుణ్య స్నానాలు

ధర్మపురి: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం సెలవు దినం కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చి ధర్మపురి పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ముందుగా గంగమ్మ, గౌరమ్మలకు తెప్పల రూపంలో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు.



గుట్టపై శ్రీలక్ష్మీనృసింహస్వామికి పూజలు



పెద్దగుట్ట పై నుంచి కిందికి జారవిడుస్తున్న వరదపాశం, పాలు, గోదావరి జలం



అన్నదానం కార్యక్రమంలో భక్తులు

భక్తి పారవశ్యం.. వరదపాశం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రంలో కొండపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి శ్రావణమాసంలో పెద్దగుట్టపై దర్శనమిస్తారని భక్తుల నమ్మకం. ఈనేపథ్యంలో ఆదివారం భక్తులు పెద్ద గుట్టపై నృసింహస్వామికి వరదపాశం (పాయసం) సమర్పించారు. చిన్నగుట్టపై లక్ష్మీనృసింహస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు, వందలాదిగా తరలివచ్చిన భక్తులు ఉదయం 7గంటలకు పెద్ద గుట్టకు చేరేందుకు పది కిలోమీటర్లు కాలినడకన బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం గోదావరి జలాలు, బెల్లం, పంచదారతో వండిన పాశం, పాలను కొండపై నుంచి కిందికి స్వామివారి జయజయధ్వనాల మధ్య జారవిడిచారు. భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమారాచార్యులు, డీసీఎంఎస్ అధ్యక్షుడు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ గర్శకుర్తి శిల్ప, బీజేపీ బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పదాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డెంగీతో చిన్నారి మృతి


గోనే మోక్ష (ఫైల్)

రాయికల్: డెంగీతో చిన్నారి మృతిచెందిన ఘటన ఆదివారం రాయికల్ మండలం రామాజీపేటలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోనే గౌతమి–రాజరెడ్డి కూతురు గోనే మోక్ష(5)కు వారం రోజులుగా తీవ్రస్థాయిలో జ్వరం రాగా జగిత్యాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి డెంగీగా నిర్ధారించారు. రక్తకణాలు తక్కువగా ఉన్నాయని తెలపడంతో కరీంనగర్ తరలించి వైద్యం అందిస్తుండగా మృతిచెందింది. రాజరెడ్డి ఇటీవలే ఉపాధి నిమిత్తం గల్ఫ్‌వెళ్లాడు. చిన్నారి మృతితో తండ్రి తిరుగు ప్రయాణం అయ్యాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పేకాట శిబిరంపై దాడి

మెట్‌పల్లిరూరల్: జగిత్యాల జిల్లా సరిహద్దు శివారులోని గండి హనుమాన్ ఆలయం సమీపంలోని ఓ దాబాకు కొద్దిదూరంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు చేసినట్లు తెలిసింది. ఈదాడుల్లో పేకాట రాయుళ్ల నుంచి సుమారు రూ.74,840 నగదు, 9 సెల్‌ఫోన్‌లు, 4 బైకులు స్వాధీనం చేసుకుని మొత్తం 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌స్తంభంపై పిడుగుపాటు

- చెలరేగిన మంటలు


విద్యుత్ స్తంభంపై చెలరేగిన మంటలు

మేడిపల్లి: మండలంలోని భీమారంలో ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. ఇదే సమయంలో గ్రామశివా రులోని ఓ విద్యుత్ స్తంభంపై పిడుగుపడడంతో మంటలు చెలరేగి పొగలు కమ్ముకున్నాయి దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యా రు. విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేయడంతో ఎలాంటి ఇబ్బంది కలగలేదు.

10 క్వింటాళ్ల బియ్యం పట్టివేత


పట్టుబడ్డ బియ్యంతో పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ శివారులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గూడెంకు చెందిన అల్వాల స్వామి, ముద్రకోల ప్రశాంత్, సామ్యూల్, వానరాశి మల్లయ్య ఓ వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ముస్తాబాద్‌లో రేషన్ బియ్యం దందా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోరు దొంగల కోసం గాలింపు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలో బోరుమోటార్లు, ఇనుప కడ్డీలు చోరీచేసే ముఠాను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సిరిసిల్ల పట్టణంలోని సిక్‌వాడకు చెందిన పలువురు వ్యక్తులు ఇటీవల ఓ ఇంట్లోని బోరుమోటారుతో పాటు పైపులను దొంగిలించినట్లు అనుమానం వ్యక్తంచేస్తూ వచ్చిన ఫిర్యాదుతో సిరిసిల్లటౌన్ పోలీసులు గస్తీ తిరుగుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. జిల్లాకేంద్రంలో కొత్త భవన నిర్మాణాలు, తాళంవేసిన ఇళ్లను టార్గెట్‌చేస్తూ దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్లు ఇటీవల పోలీసులకు ఫిర్యాదులు అందడంతో సిక్‌వాడలో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

ఇటు కోతులు.. అటు అడవి పందులు

- అడవి జంతువుల భయంతో మిశ్రమ పంటలకు స్వస్తి
- రెండు పంటల స్థానంలో ఒకే పంట సాగుచేస్తున్న రైతులు


సాగుచేసిన పసుపు పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బలవర్ధకమైన సాగు భూములు, సాగునీరు పుష్కలంగా ఉండడంతో, ఇక్కడి రైతులు ఒకే భూమిలో, ఒకే సమయంలో రెండు పంటలు(మిశ్రమ పంటలు) సాగుచేస్తుంటారు. దీంతో ఓ పంట ద్వారా వచ్చే ఆదాయం సాగుఖర్చులకు పోయినా, మిగిలిన పంటలతో వచ్చే ఆదాయం రైతులకు మిగులుబాటుగా నిలుస్తోంది. ఇటీవలి కాలంలో అడవిపందుల బెడద ఎక్కువకావడంతో రైతులు మిశ్రమ పంటలకు ఫుల్‌స్టాప్ పెడుతూ, ఆదాయం కోల్పోతున్నారు.

జిల్లాలో ఎత్తైన గుట్టలు, గోదావరి తీర ప్రాంతం

జిల్లాలో దట్టమైన అటవీప్రాంతం ఎక్కువగా ఉండడంతో గుట్టలు, ఎత్తైన చెట్ల మధ్య అడవి జంతువులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గోదావరి తీరప్రాంతాలైన ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, సారంగాపూర్, ధర్మపురి, వెల్గటూర్ మండలాల్లో అడవిజంతువుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రాంతాల్లో రైతులు ఏ పంట సాగుచేసినా అడవిపందులు, కోతులు, నెమళ్లు నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో వేరుశనగ, పెసర, కందులు, మొక్కజొన్న వంటి పంటలు వేయాలంటే రైతులు భయపడే పరిస్థితి తలెత్తింది. దీంతో, విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికందే వరకు కాపాలా కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు రైతులైతే పంటపొలాల్లో మంచెలు వేసుకుని, రాత్రిళ్లు పంటవైపు అడవిపందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఒకే పంటతో రైతుల ఆదాయానికి గండి...

జిల్లా రైతులు పసుపుతో పాటు మొక్కజొన్న, వేరుశనగ, కంది, కూరగాయాలు...ఇలా రకరకాల మిశ్రమ పంటలు సాగుచేస్తుంటారు. అయితే, జిల్లాలోని జగిత్యాల, మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, గొల్లపల్లి వంటి ప్రాంతాల్లో కోతులబెడద, దట్టమైన అటవీప్రాంతాలైన సారంగాపూర్, కథలాపూర్, ధర్మపురి వంటి ప్రాంతాల్లో అడవిపందులు గుంపులు గుంపులుగా వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు అడవిపందుల బారినుంచి తప్పించుకునేందుకు మొక్కజొన్న, వేరుశనగ పంటలు సాగుచేయకుండా కేవలం పసుపు, వరి వంటి పంటలు సాగుచేస్తున్నారు. దీంతో ఒకే పంట సాగుతో, రైతులకు అనుకున్నస్థాయిలో ఆదాయం రావడం లేదు. గతంలో రెండు పంటలు సాగుచేసినప్పుడు ఎకరాకు రూ. లక్ష వరకు ఆదాయం వస్తే, ఇప్పుడు రూ.50 వేలు మాత్రమే వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఆ పంటకు సైతం మార్కెట్‌లో రేటు ఉంటేనే, ఆదాయం వస్తుందని లేకుంటే పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. అడవి జంతువులతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఒకే పంట సాగు చేశాను



గతేడాది వరకు పసుపు, మొక్కజొన్న పంట సాగు చేసేవాడిని. అడవి పందులు, కోతులు గుంపులుగా వచ్చి మొక్కజొన్న పంటను పూర్తిగా ధ్వంసం చేసేవి. దీంతో రోజు కాపాలా కాస్తుండేవాడిని దీంతో లాభం లేదనుకుని ఈ ఏడాది కేవలం మొక్కజొన్న స్థానంలో పసుపు పంట సాగు చేశాను.

– తీపిరెడ్డి శేఖర్, జగిత్యాల

అడవి జంతువులతో ఇబ్బందులు



అడవి జంతువులతో రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. అయితే, పంటల చుట్టూ టపాకాయలు కాల్చడం చీరలు కట్టడం వంటి కొన్ని పద్ధతుల ద్వారా పంటను కాపాడుకోవచ్చు. మిశ్రమ పంటల సాగు విడిచిపెట్టడంతో రైతులకు నష్టంతో పాటు భూమి సారం సైతం కోల్పోతుంది.

– డాక్టర్ సంపత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, వ్యవసాయ కళాశాల, పొలాస

గంజాయి మత్తులో యువకుల వీరంగం

కోరుట్ల: కోరుట్ల పట్టణం ఝాన్సీరోడ్‌లో ఆదివారం రాత్రి 8.30 గంటలకు గంజాయి మత్తులో ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. మోటార్‌సైకిల్‌పై తిరుగుతూ అడ్డువచ్చిన వారిని ఇటుకలతో చంపుతామని బెదిరించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. ఝాన్సీరోడ్ ఏరియాలో వేగంగా మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న యువకులు ఓ కిరాణాషాపు యజమానిని బంచి ఇటుకలతో కొట్టేందుకు యత్నించినట్లు కాలనీవాసులు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి రమేశ్ అనే వ్యక్తిపై ఇటుకలతో దాడికి యత్నించినట్లు తెలిసింది. యువకులు మత్తులో హంగామా చేస్తుండగా స్థానికులు 100కు డయల్‌చేశారు. అనంతరం ఝాన్సీరోడ్‌కు చెందిన కొంత మంది మున్సిపల్ వైస్‌చైర్మన్ గడ్డమీద పవన్ వద్దకు వెళ్లి యువకులు దాడికి యత్నించి, గొడవచేసిన విషయాన్ని తెలుపగా ఎస్సై కిరణ్‌కు సమాచారం ఇచ్చారు. యువకుల ఆచూకీకి పోలీసులు గాలిస్తున్నారు.

ఉచిత న్యూరో వైద్యశిబిరం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో ఉచిత న్యూరో మెగా వైద్యశిబిరానికి స్పందన లభించింది. కట్టమైసమ్మ తల్లి గోల్డెన్ టెంపుల్, సిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. డాక్టర్ సూర్యప్రకాశ్‌రావు ఉచిత వైద్యసేవలు అందించగా నిర్వాహకులు 400 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. టెంపుల్ ట్రస్టు చైర్మన్ కొండ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల శ్రీనివాస్, కోశాధికారి బైరి రాజమల్లు పాల్గొన్నారు.

బోనమెత్తి... మొక్కు తీర్చి

- పెద్దమ్మతల్లి కృపతో నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరుచుకోవాలని మొక్కులు
- షుగర్ ఫ్యాక్టరీ నుంచి పెద్దమ్మగుడి వరకు బోనాలు, చెరుకు రైతులతో కలిసి తరలిన సీఎస్సార్
- ఫ్యాక్టరీ పునరుద్ధరణకు బోనం సమర్పించి మొక్కు చెల్లిస్తానన్న సీఎస్సార్


బోనాలతో ర్యాలీగా పెద్దమ్మగుడికి తరలివెళ్తున్న సీఎస్ఆర్, చెరుకు రైతులు

మల్లాపూర్: నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరుచుకోవాలని సీఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు ఫ్యాక్టరీ నుంచి పెద్దమ్మతల్లి గుడికి బో నాలతో చెరుకు రైతులు, కుటుంబ సభ్యులతో కలిసి తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చెరుకు ఫ్యాక్టరీ పునరుద్ధరణే లక్ష్యంగా ఆ దివారం చెన్నమనేని శ్రీనివాస్‌రావు 'పెద్దమ్మతల్లికి బోనాలు' అనే విన్నూత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. చక్కెర ఫ్యాక్టరీ మూసివేడయడంతో చెరుకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోనే సుమారు 2,500 ఎకరాల్లో లక్ష టన్నుల చెరుకు సాగవుతోందని, ఈ పంటను కామారెడ్డి గాయత్రి ఫ్యాక్టరీకి తరలించడంతో రూ.5కోట్ల వరకు రవాణ భారంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని రైతులు సహకార భాగస్వామ్య (కో–ఆపరేటీవ్) పద్ధతిలో నడిపేందుకు సిద్ధంగా లేమన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి ప్రభుత్వపరంగానైన, ప్రైవేటు పరంగానైన నడిపించాలని డిమాండ్ చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించే వరకు ప్రతిఏటా షుగర్ ఫ్యాక్టరీ నుంచి పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణ రెడ్డి చెరుకు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

గల్లంతైన హెడ్‌కానిస్టేబుల్ మృతి


మృతదేహాన్ని బయటికి తెస్తున్న కుటుంబసభ్యులు


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

- తిమ్మాపూర్–ముంజంపల్లి శివారులో మృతదేహం లభ్యం

తిమ్మాపూర్: కాకతీయ కాలువలో శుక్రవారం సాయంత్రం గల్లంతైన హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య (50) మృతిచెందారు. ఆదివారం సాయంత్రం ఆయన మృతదేహం లభ్యమైంది. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం నుంచి కాలువలోని గేట్లలో ఒకటి మూసుకోకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. సీఐ ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి, గేటు త్వరగా మూసివేయాలని కోరారు. వారు శ్రమించి, ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూయించారు. దీంతో గాలింపు చర్యలు వేగవంతం చేశారు. సాయంత్రం 6 గంటలకు తిమ్మాపూర్–ముంజంపల్లి శివారులో మల్ల య్య మృతదేహం దొరికినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య హేమలత, కూతుళ్లు కీర్తన, శ్రీజ ఉన్నారు.

పర్యవేక్షించిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య కొన్నేళ్లుగా మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వద్ద గన్ మెన్‌గా పని చేస్తున్నారు. ఆయన కాకతీయ కాలువలో గల్లంతయ్యారని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం కాలువ వద్దకు వచ్చారు. గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు.

అప్పుల ఊబిలో తెలంగాణ రాష్ట్రం

- యూపీ ఎమ్మెల్యే పీఎన్. పాఠక్



మాట్లాడుతున్న యూపీ ఎమ్మెల్యే పాఠక్

ధర్మపురి: ఆర్థిక పరిపుష్టి గల తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని ఉత్తరప్రదేశ్‌లోని ఖుషినగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పీఎన్. పాఠక్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం అధ్యక్షతన జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావుతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో బీఆర్ఎస్ పనులు ప్రగతి, ప్రభుత్వం సంక్షేమ పథకాలపై 8 రోజులుగా పర్యటించి ఒక సమగ్రమైన నివేదికను తీసుకున్నానని కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. బీఆర్ఎస్ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసంచేస్తోందన్నారు. కేవలం కేసీఆర్ కుటుంబ పాలన కోసమే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాడన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. బీఆర్ఎస్ అందిస్తున్న సంక్షేమ పథకాల్లో కేవలం 10శాతం మందికే చేరుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని కుటుంబపాలనకు చమర గీతం పలుకుతారని జ్యోష్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, రాష్ట్ర స్వచ్ఛ భారత్ కన్వీనర్ మంచె రాజేశ్, దళితమోర్చా రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి చింతకింది అనసూర్య, నాయకులు బండారి లక్ష్మణ్, బెజ్జారపు లవన్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులున్నారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

- ఆసరా పెన్షన్ ఇప్పిస్తానంటూ మోసం
- ఇంకా బాధితులుంటే ఫిర్యాదుచేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఆసరా పెన్షన్ ఇప్పిస్తానంటూ నమ్మించి డబ్బులు కాజేసిన మోసగాడిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నిందితుడి నుంచి పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్లలోని రెడ్డివాడలో నివసిస్తున్న బైరగోని లింగయ్య ఆసరా పెన్షన్లు ఇప్పిస్తానని అందుకు కొంత ఖర్చు అవుతుందని చెప్పి మారుపాకకు చెందిన బోయిని సుజాతను పరిచయం చేసుకుని ఆమె వద్ద నుంచి రూ.45వేలు తీసుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత ఆమెకు పింఛన్ మంజూరైందని చెప్పి ప్రతీనెల రూ.2వేలు ఆమె బ్యాంకు ఖాతాలో నిందితుడు లింగయ్య జమచేశాడు. ఈక్రమంలో ఇదే గ్రామానికి చెందిన పడిగెల అపర్ణ, పడిగెల నాగవ్వ, కుమ్మరి భాగ్య నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.13,500 చొప్పున మొత్తం రూ. 40,500 వసూలు చేసి వారికి ఎలాంటి ఆసరా పింఛన్ ఇప్పించకుండా తిరుగుతున్నాడు. దీంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లింగయ్యను అతని ఇంటివద్ద ఆదివారం సిరిసిల్లటౌన్ పోలీస్‌లు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. జిల్లాలో ఆసరా పెన్షన్ ఇప్పిస్తానని లింగయ్య ద్వారా మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

ఎనిమిదేళ్లకే నూరేళ్లు నిండాయి

- గుండెపోటుతో చిన్నారి మృతి
- జిల్లెల్ల గ్రామంలో విషాదం


హర్షిత (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): చిన్నతనంలోనే గుండెపోటు రావడంతో చిన్నారి ప్రాణాలు విడిచిన ఘటన తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన బొల్గం హర్షిత ఉరఫ్ జాను(8) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించింది. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. తల్లి రమ్య మూడేళ్లక్రితం రోడ్డు ప్రమాదంలో మరణించింది. తండ్రి సతీశ్‌గౌడ్ భార్య, కూతురి మరణంతో కన్నీరుమున్నీరయ్యాడు. జిల్లెల్ల గ్రామంలో విషాదం నెలకొంది.

చిన్నారులపై వీధికుక్కల దాడి



వేములవాడ: పట్టణంలోని 17వ వార్డులో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈక్రమంలో ఆదివారం ఇంటి ముందు ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులను వీధి కుక్క కరవడంతో ఆందోళనకు గురయ్యారు. వార్డులో కుక్కలు ప్రజల్ని గాయపరుస్తున్నాయని ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై కుక్క దాడిచేస్తున్నక్రమంలో గమనించిన దుర్గాప్రసాద్, నాగరాజ్ స్థానికులు చిన్నారులను కుక్కలబారి నుంచి రక్షించారు. చిన్నారుల తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



రాజన్న సేవలో జైళ్ల శాఖ ఐజీ

వేములవాడ:రాజన్నను జైళ్లశాఖ ఐజీ రాజేశ్ కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇచ్చి, ప్రసాదం అందజేశారు.

ప్రమాదవశాత్తు యువకుడికి తీవ్రగాయాలు

- నుజ్జునుజ్జయిన చేతివేళ్లు
- కరీంనగర్ ఆస్పత్రికి తరలింపు


చికిత్స పొందుతున్న జలంధర్

చందుర్తి: ఆవులకు మేతకోసం గడ్డిని గ్రాస్ కట్టర్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్‌లో పడి చేయి నుజ్జునుజ్జయింది. చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన ఉగిలే జలంధర్(22) యువకుడు ఉదయం పశువులకు మేత వేసేందుకు పాక వద్దకు వెళ్లాడు. పచ్చిగడ్డిని గ్రాస్‌కట్టర్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు చేయి మిషన్‌లో పడి చేతివేళ్లు తెగిపోయాయి. దీంతో చుట్టుపక్కల రైతులు మిషన్ ఆఫ్‌చేసి గాయపడిన యువకుడిని గ్రామస్తులు వేములవాడ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా చల్మెడ లక్ష్మీనరసింహారావు
యువకుడిని కలిసి పరామర్శించారు.

వెంటాడుతున్న విధి...

ఉడిలె లక్ష్మి–సత్తయ్య దంపతులకు ఇద్దరు కుమారు లు. పెద్ద కుమారుడు జలంధర్ జీవనోపాధి నిమి త్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల ఇంటికొచ్చాడు. ఈక్రమంలో ఆదివారం పశువులను మేత వేస్తుండగా ప్రమాదవ శాత్తు గ్రాస్‌కట్టర్‌లో చేయి పడి ప్రమాదం జరగ్గా కు టుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు 15 రోజులు గడిస్తే గల్ఫ్‌వెళ్లే వాడని రోదిస్తున్నారు. చిన్న కుమారుడు శ్రీనాథ్ నెలరోజుల క్రితం బైక్‌పై నుంచి కిందపడడంతో కాలు విరిగింది. నెలరోజుల వ్యవధిలో ఈ రెండు ఘటనలు జరగడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకుగురవుతున్నారు.

ఆదుకునే వారి కోసం ఎదురుచూపులు

రెక్కలు ముక్కలయ్యేలా పనిచేసుకుంటే ఆ కుటుంబానికి పూట గడిచేది. నెలరోజులుగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆకుటుంబం రోజురో జుకు ఆర్థికంగా చితికిపోతుంది. కుటుంబం గడవ డమే కష్టంగా ఉందని చేతికి అందివచ్చిన కొడుకును రెండేళ్ల కిందటే గల్ఫ్ పంపించారు. తల్లిదండ్రులను చూసివెళ్దామని గల్ఫ్‌నుంచి ఇంటికొచ్చి పెద్ద కుమారుని చేతు క ట్ కావడం, ఇంతకుముందే నెల రోజులు చిన్న కు మారుడు శ్రీనాథ్ కాలు విరగడంతో వైద్యం చేయించలేక ఆదుకునే వారికోసం ఆ కుటుంబం ఆశగా ఎదురుచూస్తుంది. దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సాయం అందించే వారు ఫోన్ పే 96032 90647 నంబర్‌లో పంపించాలని వేడుకుంటున్నారు.